క్లుప్తంగా

విద్యుత్ ఉద్యోగుల జీతాల్లో కోత

కర్నూలు(రాజ్‌విహార్): వినియోగదారుల సేవాల పట్ల నిర్లక్ష్యం వహించిన విద్యుత్ ఉద్యోగుల జీతాల్లో కోతా విధించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 482 మంది ఉద్యోగుల జీతాల నుంచి రూ.1.37లక్షలు రికవరీ చేసి వినియోగదారుల ఖాతాలోకి జమ చేయనున్నట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్ రెగ్యులేటరీ కమిషన్ ఆదేశాలతో జీతాల్లో కోత విధించినట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్షల్లో ఇద్దరు డిబార్

కర్నూలు సిటీ: ఉమ్మడి జిల్లాలో 123 కేంద్రాల్లో శుక్రవారం జరిగిన ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారు. ఆత్మకూరులోని సెయింట్ థెరిస్సా జూనియర్ కాలేజీలో ఒక విద్యార్థి, చాగలమర్రి ఎస్‌వీఎంవిఎస్ఆర్ జూనియర్ కాలేజీలో ఒక విద్యార్థి డిబార్ అయిన వారిలో ఉన్నారు. రెండో సంవత్సరం పరీక్షలకు 29,628 మంది విద్యార్థులకుగాను 28,773 మంది హాజరయ్యారు.

ఇద్దరికి మెమోలు.. ఈ నెల 23వ తేదీన జరిగిన ఇంటర్మీడియెట్ ఫస్ట్ ఇయర్ పరీక్షల్లో ఒకే రోజున 21 మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. తుగ్గలి ఏఎస్ జూనియర్ కాలేజీలోనే 12 మంది డిబార్ అయ్యారు. ఈ కాలేజీలోని సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న సీఎస్, డీఓలకు ఆర్ఐఓ గురవయ్య శెట్టి మెమోలు జారీ చేశారు. పరీక్ష కేంద్రంలోకి పంపే సమయంలో విద్యార్థులను తనిఖీ చేయని కారణంగానే 12 మంది చిట్టీలతో సెంటర్‌లోకి వెళ్లినట్లు తెలుస్తోంది.

రాహుల్‌గాంధీపై కక్షపూరిత చర్యలు మానుకోవాలి

కర్నూలు(సెంట్రల్): కాంగ్రెస్‌పార్టీ నేత రాహుల్‌గాంధీపై బీజేపీ కక్షపూరిత చర్యలు మానుకోవాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎం.సుధాకర్‌బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏపీ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఆదేశాల మేరకు రాహుల్‌గాంధీపై బీజేపీ పెట్టిన పరువునష్టం దావా కేసును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పార్టీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అక్కడి నుంచి కోట్ల సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు.రాహుల్‌గాంధీకి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకనే బీజేపీ పరువునష్టం దావా కేసును తెరలేపిందన్నారు. కార్యక్రమంలో నాయకులు జాన్ విల్సన్ బతుకన్న, బాబు రావు, కాశింవలి, బజారన్న పాల్గొన్నారు.

నేడు ఆర్ఎస్ఎస్ చీఫ్ రాక

కర్నూలు కల్చరల్: ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ శనివారం కర్నూలు నగరానికి చేరుకొని రాత్రి ఇక్కడే బస చేయనున్నారు. ఆదివారం ఉదయం సంగమేశ్వరం వెళ్లి పుణ్య స్నానం ఆచరించి సంగమేశ్వరున్ని దర్శించుకుంటారు. అనంతరం కర్నూలుకు వచ్చి తిరుగు ప్రయాణం కానున్నారు.

రేపు 'మాలపల్లి 'పై సదస్సు

కర్నూలు కల్చరల్: సాహితీ సదస్సు ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీ ఉదయం 10 గంటలకు కేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వంద సంవత్సరాల 'మాలపల్లి ' ఉన్నవ లక్ష్మీనారాయణ నవలపై సాహితీ సదస్సు నిర్వహిస్తున్నట్లు సదస్సు అధ్యక్షులు కురాడి చంద్రశేఖర కల్కూర తెలిపారు. సాహితీ ప్రియులు అందరూ పాల్గొనాలని సూచించారు.

రేపు విశేష నగర సాంఘిక్

కర్నూలు కల్చరల్: రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ విశేష నగర సాంఘిక్‌ను ఈ నెల 26వ తేదీ ఉదయం 7 గంటలకు ఏక్యాంప్ మాంటిస్సోరి పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు నగర సంఘ చాలక్ సూరా వెంకటరెడ్డి తెలిపారు. ప్రధాన వక్తగా ఆర్ఎస్ఎస్ సహ సర్ కార్యవాహ సీఆర్ ముకుంద హాజరు అవుతున్నట్లు పేర్కొన్నారు.

దాడులను ఖండించాలి

కర్నూలు(సెంట్రల్): త్రిపుర రాష్ట్రంలో కమ్యూనిస్టులపై జరుగుతున్న ఆర్ఎస్ఎస్, బీజేపీ గుండాల దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో త్రిపురలో దాడులను నిరసిస్తూ సుందరయ్య సర్కిల్‌లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారించాలి

కర్నూలు(సెంట్రల్): రంజాన్ మాసం ప్రా రంభం కావడంతో ముస్లింలు ఎక్కువగా ఉండే కర్నూలు నగరంలోని కాలనీల్లో విద్యు త్,తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని అవా జ్ కమిటీ నగర అధ్యక్షుడు పి.ఇక్బాల్‌హుస్సేన్ డిమాండ్ చేశారు. శుక్రవారం అవాజ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మహ్మద్ షరీఫ్ పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : కబ్జా, బలగం, దాస్ కా ధమ్కీ, రంగమార్తాండ, జాన్ విక్ చాప్టర్-4, ఆరంజ్
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్ : కబ్జా , ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి, దాస్ కా ధమ్కీ, రంగమార్తాండ, ఘోస్ట్, గీతసాక్షిగా, ఆరంజ్
వెంకటేష్ సినీ కాంప్లెక్స్: సార్, వినరో భాగ్యము విష్ణు కథ, దాస్ కా ధమ్కీ
ఐనాక్స్ : తూ జూతీ మై మక్కర్, షాజమ్ ఫరీ ఆఫ్ ది గాడ్స్, జాన్ విక్ చాప్టర్-4
రాజ్ : ఘోస్ట్
శ్రీరామ : ఆరంజ్
విజయ : జాన్ విక్ చాప్టర్-4


ఆర్చరీ శిక్షణలో విల్లును ఎక్కుపెట్టిన చిన్నారులు

గురి పెడితే.. పతకమే!

- ఆర్చరీలో రాణిస్తున్న కర్నూలు క్రీడాకారులు
- జాతీయస్థాయిలో గుర్తింపు

కర్నూలు (టౌన్): విలు విద్య(ఆర్చరీ)లో కర్నూలు నగరానికి చెందిన చిన్నారులు ప్రతిభ చాటుతున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో పతకాలు సాధిస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. క్రీడా ప్రతినిధులచే ఔరా అనిపించుకుంటున్నారు. వీరిని చూస్తే.. పిట్ట కొంచెం..కూత ఘనం అన్న నానుడి సరిగ్గా సరిపోతుంది. వీరు పాఠశాలల్లో ఒకటి, రెండు తరగతులే చదువుతున్నా ఆర్చరీ పోటీల్లో గురి పెట్టారంటే.. పతకం కొట్టాల్సిందే అన్నట్లు ఆటను ప్రదర్శిస్తున్నారు.

స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఆర్చరీ శిక్షణ

విలువిద్య ఇది ఒక ప్రాచీన క్రీడ.గతంలో మహాభారతం,రామాయణం వంటి కథలకే పరిమితమైన ఈ క్రీడ తరువాత వేటకు రాను రాను కాల క్రమేణలో ఒలంపిక్స్ క్రీడగా గుర్తింపు పొందింది. ఎన్నో ఏళ్ల చరిత్ర ఉన్న ఈ ఆర్చరీకి కర్నూలు స్పోర్ట్ అథారిటీ స్టేడియంలోనూ అన్ని సౌకర్యాలు ఉన్నాయి. క్రీడాకారుల కోసం ఇద్దరు కోచ్‌లు ఉన్నారు.2004 నుంచి ఏటా 50 నుంచి 60 మందికి శిక్షణ ఇస్తున్నారు. వేసవి శిక్షణశిబిరంలో ఈ క్రీడాకు ప్రత్యేక ఆదరణ ఉంది. తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకొచ్చి వేసవి శిక్షణ శిబిరంలో ఆర్చరీలో శిక్షణ ఇప్పిస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు 11 మంది కర్నూలు క్రీడాకారులు సబ్ జూనియర్ స్థాయిలో ఆల్ ఇండియా పోటీల్లో రాణించి పతకాలు సాధించారు.అంతేగాక ఎంతో మంది జిల్లా, రాష్ట్రస్థాయిలో తమ సత్తా చాటుతూ పతకాల వేట సాగిస్తున్నారు. విలువిద్యలోని రికర్వ్‌బో(70మీటర్లు), ఇండియన్‌బో(30-50 మీటర్లు), కాంపౌండ్‌బౌ(50-50 మీ)లలో పోటీలు నిర్వహిస్తారు.

2004 నుంచి ఆర్చరీ పోటీలు



స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో 2004 సంవత్సరం నుంచి ఆర్చరీ పోటీలు నిర్వహిస్తున్నాం. ఆర్చరీ క్రీడకు మంచి ఆదరణ ఉంది. ఇప్పటికే కర్నూలు నుంచి 20 మంది సబ్ జూనియర్,జూనియర్‌విభాగాల్లో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు. వేసవి సెలవుల్లో స్టేడియంతో పాటు బి.క్యాంపు క్రీడామైదానంలో ఉచితంగా ఆర్చరీ శిక్షణ ఇస్తున్నాం. అలాగే ప్రతి రోజు స్టేడియంలో శిక్షణ ఉంటుంది. 18 సంవత్సరాలుగా కర్నూలులోనే జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం కొంత ప్రోత్సాహం ఇస్తే అనేక మంది జాతీయస్థాయి ఆర్చరీ క్రీడాకారులను తయారు చేస్తాం.

–నాగరత్నమయ్య, కార్యదర్శి, జిల్లా ఆర్చరీ అసోసియేషన్

'ఆద్వితీ'య ప్రతిభ



ఆద్వితీ ఆర్చరీ క్రీడాకారిణి. స్థానిక సోమిశెట్టినగర్‌లో నివసిస్తున్న ఈ చిన్నారి కర్నూలు గురుకుల విద్యాలయంలో ఒకటవ తరగతి చదువుతుంది. తల్లిదండ్రులు వ్యాపారం చేస్తున్నారు. చిన్నారి ఆర్చరీ పోటీల్లో పాల్గొంటే పతకం ఖాయం. గత ఏడాది ఆగస్టులో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో, నవంబర్ నెలలో ధ్యాన్ చంద్ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లోనూ బంగారు పతకాలు సాధించింది. అలాగే విజయవాడలో గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభచాటి బంగారు పతకం కైవసం చేసుకుంది. ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో 6వ స్థానంలో నిలిచింది.

ఆర్చరీలో యోగానంద్‌కు ప్రత్యేక గుర్తింపు



యోగానంద్ ఏథీనా పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్నాడు. స్థానికంగా గుత్తి పెట్రోల్ బంకు సమీపంలోని కాలనీలో నివసిస్తున్నాడు. తల్లిదండ్రులు సునీల్, శిరీషా వృత్తిరీత్యా వ్యాపారం చేస్తున్నారు. ఆర్చరీలో తన కంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. ప్రతి పోటీల్లోనూ రాణిస్తూ ఆల్ఇండియా స్థాయిలో 64వ ర్యాంకు సాధించాడు. ఆంధ్రప్రదేశ్‌లో 14వ స్థానంలో ఉన్నాడు. గత మార్చి నెలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో బంగారు పతకం, డిసెంబర్ నెలలో విజయవాడలో నిర్వహించిన పోటీల్లోనూ బంగారు పతకం సాధించాడు.

ఆల్ ఇండియాలో 69వ ర్యాంకు కె.పార్థచంద్ర



కె.పార్థచంద్ర మాంటిస్సోరి పాఠశాలలో ఒకటవ తరగతి చదువుతున్నాడు. స్థానికంగా లక్ష్మీనగర్‌లో నివసిస్తున్నాడు. తండ్రి వంశీకృష్ణ ఆర్చరీలో జాతీయ స్థాయిలో రాణించాడు. ప్రస్తుతం కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. కుమారుడు సైతం ఇదే క్రీడలో మంచి ప్రతిభ చాటుతున్నాడు. ఇప్పటికే ఆల్ ఇండియా స్థాయిలో 69వ ర్యాంకు సాధించాడు. గత ఏడాది ఆగస్టు, నవంబర్ నెలలలో రెండు సార్లు నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో బంగారు పతకాలు, ద్యాన్‌చంద్ క్రీడల్లో వెండి పతకం సాధించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో 6వ స్థానంలో నిలిచాడు.

శ్రీ ఉరుకుంద చిట్‌ఫండ్ కంపెనీకి మొట్టికాయ

- సేవాలోపంపై వినియోగదారుల కమిషన్ చర్యలు
- బాధితుడికి 9 శాతం వడ్డీతో చిట్ మొత్తం చెల్లించాలని ఆదేశం

కర్నూలు(లీగల్): చిట్ సభ్యుడి నుంచి కంతులు వసూలు చేసి ఆ తర్వాత చిట్ మొత్తాన్ని ఇవ్వకుండా సేవాలోపం చేసిన చేసిన శ్రీ ఉరుకుంద చిట్‌ఫండ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్‌తో పాటు చిట్ రిజిస్ట్రార్‌కు కర్నూలు వినియోగదారుల కమిషన్ శుక్రవారం తగిన రీతిలో మొట్టికాయ వేసింది. స్థానిక కొత్తపేటకు చెందిన ఫిర్యాది పి.వెంకటేశ్వర్లు 2014 సంవత్సరంలో చిట్‌ఫండ్ కంపెనీలో 5 లక్షల చిట్‌లో చేరి మొత్తం రూ.4,80,000 చెల్లించారు. 2018 సంవత్సరంలో చిట్ ఎత్తగా రూ.4.64 లక్షలకు రెండు చెక్కులను కంపెనీ ఇచ్చింది. చెక్కులను బ్యాంకులో వసూలు కోసం వేయగా చిట్ కంపెనీలో ఖాతా నిల్వలు లేకపోవడంతో బౌన్స్ అయ్యాయి. దీంతో ఫిర్యాదిదారుడు తనకు రావాల్సిన చిట్ మొత్తం చెల్లింపు కోసం చిట్స్ రిజిస్ట్రార్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. చిట్‌ఫండ్ కంపెనీ స్పందించకపోవడంతో జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. బాధితుడికి డబ్బును చెల్లించకపోవడం సేవాలోపంగా నిర్ధారించి పి.వెంకటేశ్వర్లుకు చిట్ మొత్తం రూ.4,64,000కు 9 శాతం వడ్డీతో 45 రోజుల్లో చెల్లించాలని, కోర్టు ఖర్చుల కింద రూ.5 వేలు, మానసిక వేదనకు గురి చేసినందుకు రూ.20 వేలు చెల్లించాలని కమిషన్ అధ్యక్షులు కరణం కిషోర్‌కుమార్, సభ్యులు ఎస్.నారాయణరెడ్డి, ఎస్.నసీమా కౌసర్‌లు ఆదేశాలు జారీ చేశారు.

చేపల ఉత్పత్తికి ప్రణాళికలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో చేపల ఉత్పత్తిని గణనీయంగా పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం వ్యవసాయ అనుబంధ శాఖలపై మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ..కొతాళం నుంచి గూడూరు వరకు ఉన్న చౌడు భూముల్లో ఫిష్ పాండ్స్ ఏర్పాటు చేసి మత్స్య సంపదను పెంపొందించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం వ్యవసాయ, మైక్రో ఇరిగేషన్ విభాగాలతో సమన్వయం చేసుకోవాలన్నారు. రబీ పంటలకు సంబంధించి ఈ–క్రాప్ బుకింగ్ పూర్తయ్యిందని, రైతులు 96 శాతం మంది ఈ–కేవైసీ ద్వారా ధ్రువీకరించుకున్నారని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ రామసుందర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి పి.ఎల్.వరలక్ష్మి, మత్స్య శాఖ డీడీ శ్యామల, ఏపీ ఎంఐపీ ఈడీ ఉమాదేవి, ఉద్యానశాఖ ఏడీ పి.రామాంజనేయులు, పశుసంవర్ధక శాఖ జేడీ రామచంద్రయ్య, ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు తైక్వాండో అవసరం

కర్నూలు (టౌన్): ప్రస్తుత సమాజంలో ఆత్మరక్షణకు తైక్వాండో వంటి మార్షల్‌ఆర్ట్స్ క్రీడలు అవసరమని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ రమణ అన్నారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం పురస్కరించుకొని మహిళలకు వంటల పోటీలు, క్రీడా పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు తైక్వాండో విన్యాసాలు ప్రదర్శించారు. సీఈఓ మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తోందన్నారు. సెట్కూర్ మేనేజర్ సత్యనారాయణ, చీఫ్‌కోచ్ నటరాజరావు, ఏపీడీ ప్రమీళ దేవి, మెప్మా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు శనివారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో బహుమతుల ప్రదానం, ముగింపు కార్యక్రమం ఉంటుందని సీఈఓ రమణ తెలిపారు.


స్టేడియంలో తైక్వాండో విన్యాసాలు ప్రదర్శిస్తున్న విద్యార్థిని

ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు

కర్నూలు: కర్నూలు నగరం గణేష్‌నగర్‌లో నివాసముంటున్న ఆటోడ్రైవ్ కరుణాకర్‌పై మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. ఈయన ఐదేళ్ల క్రితం కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో స్వీపర్‌గా పనిచేసేవాడు. బుధవారపేటకు చెందిన ఓ మహిళ కూడా ఆయనతో పాటు స్వీపర్‌గా పనిచేస్తుండేది. ఇరువురి మధ్య పరిచయం పెరిగింది. కొంతకాలం తర్వాత కరుణాకర్ స్వీపర్ ఉద్యోగం మానేసి ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. అయితే తరచూ ఆసుపత్రికి వెళ్లి బుధవారపేటకు చెందిన మహిళను చెడు ప్రవర్తనతో వేధిస్తుండటంతో ఆమె మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆసుపత్రిలో బాలిక అదృశ్యం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ మైనర్ బాలిక అదృశ్యమయ్యింది. తెలంగాణ రాష్ట్రం గద్వాలకు చెందిన బాలిక కుటుంబీకులు కొంతకాలంగా కర్నూలు నగరంలోని అశోక్‌నగర్‌లో నివాసముంటున్నారు. ఆ బాలికకు మైనార్టీ తీరకుండానే తల్లిదండ్రులు పెళ్లి చేయడంతో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు ఐసీడీఎస్‌కు అప్పగించారు. వారు ఆ బాలికను కొన్ని రోజుల క్రితం కర్నూలు ప్రభుత్వాసుపత్రి ఆవరణలోని మహిళా ప్రాంగణంలో ఉంచారు. మూడు రోజుల క్రితం బాలికకు కడుపునొప్పి రావడంతో ఆసుపత్రిలో చేర్చారు. ఇదే సమయంలో బాలిక ఆసుపత్రి నుంచి అదృశ్యమయ్యింది.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): వేసవిలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీనియర్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. ఆయుష్ దత్తత గ్రామమైన పసుపులలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఇందులో 59 మందిని పరీక్షించి తగిన ఔషధాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ వేసవిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం గురించి వివరించారు. కార్యక్రమంలో సచివాలయ హెల్త్ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముడు ధర్మస్వరూపుడు

కర్నూలు కల్చరల్: రాముడు మూర్తీభవించిన ధర్మస్వరూపమని తరిగొండ వెంగమాంబ సేవా సమితి అధ్యక్షులు, తెలుగు పండితులు పసుపులేటి నీలిమ అన్నారు. శుక్రవారం కర్నూలు పట్టణం పాతబస్తీలోని రాంబొట్ల దేవస్థానంలో జరుగుతున్న శ్రీమద్రామాయణ ప్రవచన కార్యక్రమాల్లో భాగంగా రెండవ రోజు శ్రీరాముడు – ధర్మస్వరూపుడు అనే అంశంపై ప్రవచించారు. డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన యోగ మహోత్సవం


జ్యోతి ప్రజ్వలనతో యోగ మహోత్సవం ప్రారంభిస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్:హార్ దిల్ ధ్యాన్.. హార్ దిన్ ధ్యాన్ పేరుతో యోగ మహోత్సవం శుక్రవారం గణేష్ నగర్ రామచంద్ర మిషన్‌లో ప్రారంభమైంది. హార్ట్ ఫుల్‌నెస్ ఇనిస్టిట్యూట్, శ్రీరామ చంద్ర మిషన్, సాంస్కృతిక మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో భారత్ స్వాభిమాన్ జిల్లా కోఆర్డినేటర్ శివరాజ్, పతాంజలి సమితి సభ్యులు ఉపేంద్ర గౌడ్, రామచంద్ర మిషన్ కర్నూలు, అనంతపురం జోనల్ కోఆర్డినేటర్ కె.రామాంజనేయులు, కర్నూలు కేంద్రం కోఆర్డినేటర్ బి.పి.వెంకటరెడ్డిలు జ్యోతి ప్రజ్వలనతో యోగ మహోత్సవ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ఒత్తిడి, ఆందోళనల నుంచి యోగా, ధ్యానం ద్వారానే బయటి పడతామన్నారు. క్రమం తప్పకుండా ధ్యానం చేయడంతో పాటు యోగాసనాలు వేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటామన్నారు. శనివారం, ఆదివారం రెండు రోజుల పాటు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఉచితంగా నిర్వహిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గర్భిణులను ప్రసవానికి ముందే ఆసుపత్రిలో చేర్చాలి

- జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు

కర్నూలు(హాస్పిటల్)/కర్నూలు(సెంట్రల్): గర్భిణులను ప్రసవానికి మూడు రోజుల ముందే ఆసుపత్రిలో చేర్చేలా చర్య లు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు చెప్పారు. శుక్రవారం కర్నూలు మెడికల్ కాలేజీ నూతన ఆడిటోరియంలో కర్నూలు డివిజన్‌లోని ఏఎన్ఎంలు, హెల్త్ సూపర్‌వైజర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులకు అందిస్తున్న సేవలను ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్రచికిత్స చేయించుకున్న వారికి ఫాలో అప్ చేస్తూ వారికి వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సీడీ, ఎన్‌సీడీ సర్వేను వంద శాతం పూర్తి చే యాలన్నారు. గర్భిణులకు, 15 సంవత్సరాలలోపు ఉన్న పిల్లలకు వంద శాతం టీకాలు వేయాలని ఆదేశించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా ఎస్‌డీజీ గోల్ సాధనకు గాను ఆరోగ్యసేవలను బలోపేతం చేయాలన్నారు. బాలికలు చిన్న వయస్సులోనే గర్భం దాల్చకుండా ఉండేందుకు బాల్యవివాహాలను అరికట్టే విధంగా సచివాలయాల పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. సచివాలయంలోని హెల్త్ వర్కర్లు, సచివాలయ పరిధిలోని నూతన దంపతులను కలిసి వారి ఆరోగ్య విషయంపై ఆరా తీయాలని, స్త్రీలు గర్భం దాల్చినట్లయితే వారి వివరాలను అప్‌లోడ్ చేసి ప్రతి నెలా వారి దగ్గరకు వెళ్లి రక్తపరీక్షలు చేస్తూ అవసరమైన వారికి ఐరన్ మాత్రలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రామగిడ్డయ్య, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, డీపీఎంవో డాక్టర్ ఉమా, ఆర్‌బీఎస్‌కే కో ఆర్డినేటర్ హేమలత, ఫ్యామిలి ఫిజీషియన్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ బాలమురళి, డీపీవో విజయరాజు, ఎస్‌వో హేమసుందరం, డెమో శ్రీనివాసులు పాల్గొన్నారు. అదేవిధంగా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు సంబంధించిన 8 అంశాలపై నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలన్నారు. ఇప్పటికే ఈ అంశంపై 91 శాతం లక్ష్యం సాధించామని, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలతోపాటు పాఠశాలలకు వెళ్లని బాలికలకు కూడా రక్తహీనత పరీక్షలు నిర్వహించి నివారణ చర్యలు తీసుకోవాలని సంబంధిత మెడికల్ ఆఫీసర్ హేమలతను ఆదేశించారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక వసతుల కల్పనపై తనకు నివేదిక ఇవ్వాలని కలెక్టర్ డీఈఓ రంగారెడ్డిని ఆదేశించారు. కార్యక్రమంలో సీపీఓ అప్పలకొండ, డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య, ఐసీడీఎస్ పీడీ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వరరావు

వర్కు టూ రూల్ పాటించాలి

కర్నూలు(సెంట్రల్): విధులకు హాజరయ్యే ఉద్యోగులను ఏపీ జేఏసీ అమరావతి అడ్డుకుంది. వర్కు టూ రూల్ ప్రకారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకే ఉద్యోగులు విధులు నిర్వహించాలని కోరింది. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో రీసర్వేపై అధికారుల సమీక్ష సమావేశం ఉంది. ఈ కార్యక్రమానికి సంబంధిత అధికారులు రాగా... ఏపీజేఏసీ నాయకులు అడ్డుకొని వెనక్కి పంపారు. ఈ సందర్భంగా ఏపీజేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ గిరికుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులను చిన్నచూపు చూస్తోందన్నారు. తమ డిమాండ్లు పరిష్కరించే వరకు వర్కు టూ రూల్‌ను పాటించాలని ఉద్యోగులను కోరారు.

31న బార్ అసోసియేషన్ ఎన్నికలు

కర్నూలు(లీగల్): ఏపీ బార్ కౌన్సిల్ నిబంధనల మేరకు ఈ నెల 31న కర్నూలు జిల్లా న్యాయవాదుల సంఘం ఎన్నికలు జరగనున్నాయి. గురువారం న్యాయవాద సంఘ సర్వసభ్య సమావేశంలో ఎన్నికల అధికారిగా న్యాయవాది కె.రాజమోహన్‌రెడ్డిని నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈనెల 27వ తేదీన అభ్యర్థుల నామినేషన్, 28న ఉపసంహరణ, 31వ తేదీ శుక్రవారం పోలింగ్ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించి అదే రోజు ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చాటండి

కర్నూలు (టౌన్): ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు రాజస్థాన్‌లోని బన్వారలో నిర్వహిస్తున్న 46వ జాతీయ స్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు ప్రతిభ చాటాలని జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ రుద్రా రెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం జాతీయ పోటీల్లో పాల్గొనే జట్టుకు స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో సత్య డెంటల్ క్లినిక్ అధినేత డాక్టర్ సర్వేశ్వరరెడ్డి స్పాన్సర్ చేసిన క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథాటీ ఇండియా కోచ్ బినయ్ పాల్గొన్నారు.


జాతీయ పోటీల్లో పాల్గొంటున్న రాష్ట్ర జట్టుకు క్రీడా దుస్తులు పంపిణీ చేసిన క్రీడా ప్రతినిధులు

ప్రకృతి వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులు దూరం

కర్నూలు(హాస్పిటల్): ప్రకృతి వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులను దూరం చేయవచ్చని నేచురోపతి వైద్యులు డాక్టర్ వీరం మురళీధర్‌రెడ్డి చెప్పారు. నేచురోపతి దినోత్సవంలో భాగంగా వీరం మురళీధర్‌రెడ్డి ఫౌండేషన్, ఎల్‌వీటీజీ కాలేజీ ఆఫ్ ఫిజియోథెరపి సంయుక్త ఆధ్వర్యంలో ఎస్ఐఎస్ ప్యూర్ వారి సహకారంతో శుక్రవారం ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వీరం మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వైద్యం ద్వారా దీర్ఘకాలిక రుగ్మతలైన ఊబకాయం, చక్కెర వ్యాధి, రక్తపోటుల నుంచి కాపాడుకోవచ్చన్నారు. సహజసిద్ధంగా వ్యాధినిరోధక శక్తిని గాలి, నీరు, సూర్యరశ్మి ద్వారా పొందవచ్చన్నారు. ప్రోగ్రామ్ ఆర్గనైజర్ జె.రమణారెడ్డి మాట్లాడారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఏంజెల్ హారిక తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ మురళీధర్‌రెడ్డి

'చలో ఢిల్లీ' జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): కార్మిక, కర్షక, కౌలు రైతు హక్కుల కోసం ఏప్రిల్ 5వ తేదీన చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు ఎం.రాజశేఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఓల్డ్‌సిటీలో సుర్జీత్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అబ్దుల్ దేశాయ్, రాజగోపాల్, మార్లేళ్ల విజయ్ పాల్గొన్నారు. స్థానిక కార్మిక, కర్షక భవన్‌లో జరిగిన సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు మాట్లాడుతూ.. చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఇక ఢిల్లీ కేంద్రంగా ఉద్యమాలు

- వాల్మీకులను ఎస్టీలుగా గుర్తిస్తూ అసెంబ్లీ తీర్మాణంపై సర్వత్రా హర్షం
- వీఆర్‌పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.సుభాష్ చంద్రబోస్

కర్నూలు(అర్బన్): వాల్మీకి/ బోయలను ఎస్టీలుగా గుర్తిస్తూ రాష్ట్ర అసెంబ్లీ తీర్మాణం చేసి కేంద్రానికి పంపుతున్న నేపథ్యంలో పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొందేంత వరకు ఢిల్లీ కేంద్రంగా ఉద్యమాలను నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వీఆర్‌పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.సుభాష్ చంద్రబోస్ అన్నారు. వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ అంశంపై నియమించిన రిటైర్డు ఐఏఎస్ అధికారి శామ్యూల్ ఆనంద్‌కుమార్ కమిషన్ రూపొందించిన సమగ్రమైన నివేదికపై ప్రభుత్వం సకాలంలో నిర్ణయం తీసుకోవడంపై రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వాల్మీకి/ బోయలందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. పాదయాత్ర సమయంలో వాల్మీకులకు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అసెంబ్లీలో తీర్మాణం చేశారని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు వీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో కార్యక్రమాలను చేపట్టనున్నట్లు చెప్పారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా అవసరమైతే రాష్ట్ర అసెంబ్లీ నుంచి ఢిల్లీ పార్లమెంట్ వరకు పాదయాత్ర చేపట్టి, జంతర్‌మంతర్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేసేందుకు కూడా వెనుకాడబోమన్నారు. ఎస్టీ రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్‌లో చట్టబద్ధమయ్యేంతవరకు వీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఉద్యమాలకు పార్టీలకు అతీతంగా వాల్మీకులు ఐక్యంగా కలిసి రావాలన్నారు. అసెంబ్లీ తీర్మానం చేసినందుకు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆన్‌లైన్‌లో కావాల్సిన సమాచారం పొందొచ్చు


జాతీయ సదస్సులో పాల్గొన్న క్లస్టర్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య డి.శ్రీనివాసులు తదితరులు

కర్నూలు సిటీ: నేటి పోటీ ప్రపంచంలో మారుతున్న కాలానుగుణంగా గ్రంథాలయాలు డిజిటల్‌గా రూపాంతరం చెందుతున్నాయని, దీంతో విద్యార్థులు తమకు కావాల్సిన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుతున్నారని క్లస్టర్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య డి.శ్రీనివాసులు అన్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్(న్యూఢిల్లీ)వారి ఆర్థిక సహకారంతో బిక్యాంపులోని సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో రెండు రోజుల పాటు జాతీయ గ్రంథాలయ సదస్సు నిర్వహించనున్నారు. శుక్రవారం ఈ సదస్సు మొదటి రోజు ప్రారంభోత్సవానికి క్లస్టర్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. లైబ్రరీలో జాతీయ సదస్సులు అనేవి చాలా అరుదుగా జరుగుతాయని, అలాంటి సదస్సు సిల్వర్‌జూబ్లీ కాలేజీలో జరగడం శుభపరిణామమన్నారు. రాబోయే రోజుల్లో క్లస్టర్ యూనివర్శిటీ పరిధిలో సాంకేతిక విద్య, నైపుణ్యాభివృద్ధి గ్రూప్‌లను ప్రారంభిస్తామన్నారు. అదేవిధంగా డిగ్రీలో పరిశోధనాత్మకమైన విద్యను సైతం ప్రవేశపెట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. అనంతరం శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ డా.పద్మిని మాట్లాడుతూ జీవితంలో క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్య అనేవి చాలా ముఖ్యమని, అవి కేవలం పుస్తక పఠనం వల్ల మాత్రమే వస్తాయన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ డా.వి.వి.ఎస్ కుమార్ మాట్లాడుతూ కోవిడ్ తరువాత కాలేజీలో జరుగుతున్న మొదటి జాతీయ సదస్సు ఇదేనని అన్నారు. ఈ సదస్సు డైరెక్టర్‌గా డా.అవినేని కిశోర్, వైస్ ప్రిన్సిపాల్ డా.బి.ఆర్ ప్రసాద్ రెడ్డి, సదస్సు సమన్వయకర్త డా.నాయకంటి మద్దయ్య తదితరులు పాల్గొన్నారు.